## ఎన్ఎంఎంఎస్‌కు పల్లగుట్ట విద్యార్థుల ఎంపిక

చిల్పూరు, జూన్ 6 : మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 8 మంది నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్‌నకు ఎంపికైనట్లు శుక్రవారం హెచ్ఎం పెనుమాటి వెంకటేశ్వర్లు తెలిపారు. జనగామ జిల్లాలోనే మొదటిసారిగా ఒకే పాఠశాల నుండి 8 మంది విద్యార్థులు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. సుమారు నాలుగు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు. గత ఏడాది పాఠశాలలో 8వ తరగతి చదివిన విద్యార్థులు సాదం అశ్విత, సాదం నిహారిక, ఆసారపు లాస్య, దాసరి చిత్ర, గుగులోత్ కార్తీక్, జీడి సుశాంత్, ఉమ్మగొని వైశాలి, జీడి ప్రీతి ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను చిల్పూరు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పోట్లపల్లి శ్రీధర్‌రావు, ఎంఈవో దాసరి గోవర్ధన్, ఉపాధ్యాయులు అభినందించారు.

## గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

జనగామ, జూన్ 6(నమస్తే తెలంగాణ) : బెస్ట్ అవైలబుల్ పథకం కింద 2025-26 విద్యా సంవత్సరానికి 3, 5, 8వ తరగతిలో ప్రవేశాలకు జనగామ జిల్లాలోని గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ చిత్రామిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాం తాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలలోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 9 నుంచి 13 వరకు హనుమకొండలోని జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, ఈ నెల 20న లాటరీ విధానంలో విద్యార్థుల ఎంపిక ఉంటుందని వివరించారు.

## ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

జనగామ, జూన్ 6(నమస్తే తెలంగాణ) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిర్లక్ష్యం చేయడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తగదని, సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ దాటవేత వైఖరిని తీవ్రంగా ఖండిస్తునట్లు టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీ శ్రీనివాస్ తెలిపారు. ఆరు నెలలకోసారి కేంద్ర ప్రభుత్వం డీఏ ప్రకటిస్తుందని, దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా డీఏ ప్రకటించాల్సి ఉంటుందని, ప్రస్తుతం రాష్ట్రంలో ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే కేవలం ఒక డీఏ మాత్రమే ప్రకటించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలనే డిమాండ్లుగా చేసుకొని, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తుండగా ప్రభుత్వం అన్ని రకాల చర్చలు జరిపినా తాజాగా ఉద్యోగులకు మొండి చేయి చూపడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలో కనీసం మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని, జడ్పీ జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ, మెడికల్ వంటి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME & DATE OF BIRTH
I, KUDULLA VARALAXMI W/o Late Rammurthy, R/o. H.No: 1-15, Vennaram (V), Dornakal (M), Mahabubabad Dist, T.G. Changed my son Name & Date of Birth KUDURLLA YESANNA INSTEAD OF KUDULLA PRAVEEN KUMAR AND ALSO HIS DATE OF BIRTH RECORDED AS 01-01-2010 INSTEAD OF 28-01-2010 for all purposes.

PLOTS FOR SALE
★ఆల్ డెవలప్‌మెంట్ D.T.C.P లే-అవుట్, 1) యాదగిరి, 2) ఘట్‌కేసర్, 3) బెంగుళూర్, 4) బొంబాయి, 5) విజయవాడ, HYD హైవేలలో తక్కువ ధరకు లభించును. సెల్: 9989552041, 7095401585
NTW-000

WANTED
★హనుమకొండలో గల ప్రముఖ కార్ డెకార్స్ నందు పనిచేయుటకు కార్ ఎలక్ట్రిషన్స్, సూపర్‌వైజర్స్ (Female) మరియు కార్ వాషింగ్ చేయుటకు Male/Female వర్కర్స్ కావలెను. సెల్: 7995621165, 6303776310.
NTW-307

WANTED
★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565


# ప్రారంభించారు.. మరిచిపోయారు

- బీటీ రోడ్డుకు కొబ్బరికాయలు కొట్టిన కాంగ్రెస్ నాయకులు
- ఏడాది దాటినా జరగని పనులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- స్వయంగా రోడ్డు వేసుకుంటున్న రైతులు



లక్ష్మీనారాయణపురంలో బీటీ రోడ్డుకు మొరం పోయించుకుంటున్న రైతులు

పాలకుర్తి, జూన్ 6 : రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు మాత్రం ప్రారంభించడం లేదు. దీంతో విసిగిపోయిన రైతులు స్థానిక ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేసి, సొంత ఖర్చులతో రోడ్డు వేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని లక్ష్మీనారాయణపురంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బీటీ రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధుల కింద రూ.1.60కోట్లు మంజూరు చేశారు. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలిచింది. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఆదేశాలతో గ్రామ కాంగ్రెస్ నాయకులు అవే నిధులతో రోడ్డు నిర్మాణానికి 2024 మార్చి 15న కొబ్బరికాయలు కొట్టారు. కానీ రోడ్డు నిర్మాణాన్ని మరిచారు. ఇప్పటి వరకూ ఎలాంటి పనులు మొదలుపెట్టలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది గడిచినా రోడ్డు నిర్మాణం కాకపోవడంతో బావుల వద్దకు వెళ్లడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యేపై నమ్మకం పోయిన సుమారు 150 మంది రైతులు సొంతంగా సుమారు రూ.2లక్షలు ఖర్చు పెట్టి ట్రాక్టర్లతో మొరం పోయించారు. డోజర్లతో క్లీన్ చేశారు. ఎమ్మెల్యేగా మామిడాల యశస్వినీరెడ్డి గెలిచి ఏడాదిన్నర గడుస్తున్నా ఎందుకు రోడ్డు పనులు ప్రారంభం కావడం లేదని లక్ష్మీనారాయణపురం తాజా మాజీ సర్పంచ్ మల్యాల సరితా పరశురాములు ఆరోపించారు. తక్షణమే కాంట్రాక్టర్‌తో చెప్పి ఎమ్మెల్యే రోడ్డు పనులు పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో తాజా మాజీ ఉప సర్పంచ్ బోడిగె ప్రదీప్, వార్డు సభ్యుడు జీ అశోక్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుండెవెని శ్రీకాంత్, రైతులు కోలుపుల యాదగిరి, ప్యారపు స్వామి, లొడంగి అనిల్, యాట అశోక్, యాకన్న, కిమిడి జంపయ్య పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్‌లో చోరీ

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 6 : మండలంలోని రాఘవాపూర్ 1వ అంగన్‌వాడీ సెంటర్‌లో చోరీ జగినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులోని యూపీఎస్‌లో 1వ అంగన్‌వాడీ టీచర్ బుధవారం సాయంత్రం తాళం వేసి వెళ్లింది. గురువారం ఉదయం వచ్చే వరకు తాళం పగలగొట్టి ఉందని, లోపల చూసే సరికి గ్యాస్ సిలిండర్ చోరీకి గురైనట్లు గుర్తించారు. గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఇదే అంగన్‌వాడీ సెంటర్‌లో క్వింటాల్ బియ్యం, ఆయిల్ ప్యాకెట్లు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు సమాచారం. గ్రామంలోని ఇండ్లకు దూరంగా ఉండడం వల్ల అంగన్‌వాడీ సెంటర్‌లో చోరీలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. శుక్రవారం జరిగిన గ్రామ సభలో అంగన్‌వాడీ సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## కోర్టు ఆర్డర్ అమలు చేయని పోలీసులు



మాట్లాడుతున్న బాధితుడు నాయిని ఎల్లారెడ్డి

పాలకుర్తి, జూన్ 6 : కోర్టు ఆర్డర్‌ను పాలకుర్తి పోలీసులు అమలు చేయడం లేదని బాధితుడు నాయిని ఎల్లారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. తన పేరున ఉన్న భూమిని శాతాపురం గ్రామానికి చెందిన నాయిని నర్సిరెడ్డి, అనగంటి సంజీవరెడ్డితో పాటు లకావత్ శంకర్ ఆక్రమించుకొని అక్రమంగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. రెండేళ్ల క్రితం పాలకుర్తి పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో కోర్టుకు వెళ్లినట్లు చెప్పారు. కోర్టు ఆ భూమి తనదేనని నిర్ణయించి, సాగు చేసుకునేందుకు పోలీస్ ప్రొటెక్షన్ అర్డర్‌ను జారీ చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం తనకు రక్షణ కల్పించాలని కోరితే పాలకుర్తి ఎస్సై దూలం పవన్‌కుమార్, సీఐ గట్ల మహేందర్‌రెడ్డి పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై వరంగల్ సీపీ సన్‌ప్రిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సీపీ, డీసీపీలు పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించినా సీఐ, ఎస్సైలు బేఖాతరు చేస్తూ నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే జిల్లా పోలీసు అధికారులు స్పందించి, కోర్టు ఆర్డర్‌ను అమలు చేసి, తనకు న్యాయం చేయాలని కోరారు. కాగా, ఈ విషయంపై ఎస్సై పవన్‌కుమార్‌ను వివరణ కోరగా నాయిని ఎల్లారెడ్డి భూమి కబ్జాలో లేదని, అతడు కబ్జాలో ఉండి ఎవరైనా దాడికి పాల్పడితేనే పోలీసులు రక్షణ ఇస్తారని తెలిపారు. అసలు భూమి ఎవరిదో కోర్టులో తెల్చుకోవాలని తెలిపారు. దీనిలో పోలీసులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తహసీల్దార్ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వివాహిత అదృశ్యం

దేవరుప్పుల, జూన్ 6 : వివాహిత అదృశ్యమైన ఘటన కడివెండిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కడవెండికి చెందిన శృతికి యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం రాయకల్‌కు చెందిన ఆది పరమేశ్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండేండ్ల పాప ఉంది. హైదరాబాద్‌లో నివాసముంటున్న వీరు ఇటీవలే రాయికల్‌కు వచ్చినట్లు తెలిసింది. అయితే, మూడు రోజుల క్రితం శృతి తన తండ్రికి ఫోన్ చేసి కడవెండికి వస్తానని చెప్పడంతో తీసుకొచ్చాడు. కాగా, బిడ్డతో వచ్చిన శృతి శుక్రవారం తెల్లవారు జామున 3 గంటలకు బిడ్డను ఇంట్లో వదిలిపెట్టి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయింది. బంధువులు చుట్టుపక్కల, పరిసరాల్లో వెతికినా కనిపించలేదు. దీంతో తండ్రి దొంటిక కొమురయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో కారోబార్‌కు గాయాలు

రఘునాథపల్లి, జూన్ 6 : విద్యుదాఘాతంతో కారోబార్‌కు తీవ్రగాయాలైన ఘటన మండలంలోని దాసన్నగూడెంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దాసన్నగూడేనికి చెందిన జేరిపోతుల షారోన్ కారోబార్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంలోని తాగునీటి బోరు పని చేయకపోవడంతో అతడు మరమ్మతు చేస్తున్నాడు. ఈ క్రమంలో బోరు పైపులను పైకి తీస్తుండగా బోరుబావి పైనే ఉన్న సింగిల్ ఫేజ్ తీగకు ఐరన్ పైపు తగిలింది. దీంతో ఒక్కసారిగా కరెంట్ షాక్ కొట్టడంతో షారోన్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని జనగామ దవాఖానకు తరలించి, చికిత్స చేయిస్తున్నారు.

## ఇప్పగూడెంలో పండుతాళ్ల పండుగ

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 6 : మండలంలోని ఇప్పగూడెంలో గీత కార్మికులు పండుతాళ్ల కల్లు పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పండుతాడు కల్లు పారడం మొదలైతే గీత కార్మికుడికి కరువు ఉండదని, అందుకే పండుతాడు కల్లు ఒడిసి, ఆ ప్రాంతంలోని గ్రామ దేవతలకు సాక పోసి, పెద్దమనుషులకు బొట్టు పెట్టి, సత్కరించి కల్లు, గుడాలుతో వేడుక జరుపుకున్నట్లు గీత కార్మికులు జూలూరు వెంకటేశ్వర్లు, మహేశ్ తెలిపారు. కార్యక్రమంలో రాజు, ఎం నరేశ్, ఎం భాస్కర్ పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

## తాగునీటి కష్టాలు తీర్చాలి

### సిద్దెంకి గ్రామ బీసీ కాలనీవాసుల ఆవేదన

జనగామ రూరల్, జూన్ 6 : 'కాంగ్రెస్ వస్తే కష్టాలు వస్తాయని ఊరికే అనలేదు. ఇప్పుడు చూస్తున్నాం. వారం రోజుల నుంచి తాగునీటి కోసం అరిగోస పడుతున్నాం' అని మండలంలోని సిద్దెంకి గ్రామంలోని బీసీ కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామంలోని జడ్పీ పాఠశాలలో ఉన్న మిషన్ భగీరథ ట్యాంక్ వద్దకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి రోజూ నీరు వస్తోందని అధికారులు చెబుతున్నా, సక్రమంగా రావడం లేదని అన్నారు. వాటర్ ట్యాంకు వద్ద నిత్యం నీరు వృథాగా పోతోందని, గ్రామానికి సక్రమంగా నీటిని విడుదల చేయడం లేదని ఆరోపించారు. ట్యాంకు నిండి పొంగిపోయే వరకు కాలనీలకు నీరు విడుదల చేయడం లేదన్నారు. దీంతో నీరు వృథాగా పోతోందన్నారు. ఇప్పటికైనా సక్రమంగా నీటిని విడుదల చేసి, తాగునీటి కష్టాలను తీర్చాలని ఉన్నతాధికారులను కోరారు. లేకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతామని హెచ్చరించారు.



నర్మెట : వెల్దండలోని రెవెన్యూ సదస్సులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



జనగామ రూరల్ : ఎల్లంలలో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

# 'భూ భారతి'తో సమస్యలకు శాశ్వత పరిష్కారం

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- వెల్దండ, కొన్నెలో రెవెన్యూ సదస్సుల పరిశీలన
- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న సదస్సులు

నర్మెట/బచ్చన్నపేట/జనగామరూరల్/రఘునాథపల్లి/చిల్పూరు/జఫర్‌గఢ్, జూన్ 6 : భూభారతి చట్టంతో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. నర్మెట మండలంలోని వెల్దండతోపాటు బచ్చన్నపేట మండలంలోని కొన్నెలో శుక్రవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను పూర్తిగా వివరించి చెప్పినప్పుడే పరిష్కారం లభిస్తుందన్నారు. దరఖాస్తులు ఇచ్చేటప్పుడు తగిన ఆధార పత్రాలను చూపించాలని సూచించారు. రెవెన్యూ అధికారులు సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సదస్సులో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల దరఖాస్తులను స్వీకరించాలన్నారు. అవసరమైతే సాయంత్రం 6 గంటల వరకు ఉండి కూడా రైతు సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం బచ్చన్నపేటలో ఆయిల్‌పామ్ సాగును పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో గోపీరామ్, తహసీల్దార్లు కేవీ రామానుజాచారి, ఫణికిశోర్, డీటీ రాము, ఆర్ఐలు సాయిబాబా, మునావర్, వంశీకృష్ణ, వీఆర్ఏలు ఉన్నారు. అలాగే, జనగామ మండలం ఎల్లంల గ్రామంతోపాటు రఘునాథపల్లి మండలం మాదారంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ పరిశీలించారు. సదస్సులకు హాజరైన రైతులు, ప్రజల భూ సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సదస్సులు ఈ నెల 20 వరకు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు హుస్సేన్, మోహ్సిన్, డీటీ శంకర్, ఆర్ఐ రవీందర్, సర్వేయర్ నరేశ్, మల్లేశ్, శారద, అనిత పాల్గొన్నారు. చిల్పూరు మండలం వెంకటాద్రిపేట, కృష్ణాజీగూడెంలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ సరస్వతి, జఫర్‌గఢ్ మండలం ఓబులాపురంలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ శంకరయ్య పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. డీటీ అనిల్ బాబు, ఆర్ఐ బలరాం, దేవేందర్, సీనియర్ అసిస్టెంట్ కల్వల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పంట రుణాలు ఇవ్వకపోతే ధర్నా చేస్తాం

స్టేషన్ ఘన్‌పూర్/దేవరుప్పుల, జూన్ 6 : వాన కాలం సీజన్ ప్రారంభమైనందున తక్షణమే పంట రుణాలు మంజూరు చేయాలని, లేకపోతే బ్యాంకుల ముందు ధర్నా చేపడతామని తెలంగాణ రైతు సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నెహ్రూకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య మాట్లాడుతూ ప్రజల డిపాజిట్లు, కేంద్ర ప్రభుత్వ వాటాధనంతో నడుస్తున్న బ్యాంకులు ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రైతులకు 18 శాతం పంట రుణాలు, 22 శాతం దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సకాలంలో బ్యాంకు రుణాలు అందక రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి, నష్టపోతున్నారన్నారు. అప్పులపాలై ఏటా కోటి మంది రైతులు పట్టణాలకు వలసపోతున్నారన్నారు. బ్యాంకులు రైతులందరికీ వ్యవసాయ రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. ఏటా ఏప్రిల్, మే నెలలో పంటు రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే 11న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతాని హెచ్చరించారు.



స్టేషన్‌ఘన్‌పూర్ : రుణాలు ఇవ్వాలని టీజీబీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కార్యక్రమంలో మండల కార్యదర్శి లింగనబోయిన కుమారస్వామి, భిక్షపతి, లింగనబోయిన యాకయ్య, గణేశ్, మంద మొగిలి, పిట్టల శ్రీను పాల్గొన్నారు. అలాగే, దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌కు రైతు సంఘం మండల కార్యదర్శి పయ్యావుల భిక్షపతి వినతిపత్రం అందజేశారు.నాయకులు బోయిని కొండయ్య, వాల్యానాయక్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి
- పలు గ్రామాల్లో జోరుగా బడిబాట కార్యక్రమాలు

దేవరుప్పుల/లింగాలఘన్‌పూర్/స్టేషన్‌ఘన్‌పూర్/నర్మెట/జఫర్‌గఢ్/బచ్చన్నపేట, జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన ఉచిత విద్య అందుతుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో బడి బాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో అర్హత ఉన్న ఉపాధ్యాయులు, ఉచిత విద్య, పాఠ్య పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందుతాయన్నారు. ప్రైవేట్ పాఠశాలకు పిల్లలను పంపి ఆర్థికభారం వేసుకోవద్దని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం గ్రామంలో శివాలయ నిర్మాణానికి నిధులు మంజూరు కాగా, ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కళావతి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సుచిత్రా ఆనంద్, అంబటి అంజయ్య, బాస్కుల అంజయ్య పాల్గొన్నారు. అలాగే, లింగాలఘన్‌పూర్ మండలంలోని నెల్లుట్లలో జరిగిన బడి బాట కార్యక్రమంలో డీఈవో బోజన్న ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించి, పాటల సీడీని ఆవిష్కరించారు. జీసీడీవో గౌసియాబేగం, ఎంఈవో విష్ణుమూర్తి, జడ్పీఎస్ఎస్, పీఎస్ హెచ్‌ఎంలు శ్రీలత, సమ్మక్క, పంచాయతీ కార్యదర్శి రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి, కారోబార్ అజయ్ పాల్గొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని రైతు వేదికలో జడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం మీసరగండ్ల సంపత్ ఆధ్వర్యంలో అంగన్‌వాడ టీచర్లు, ఆయాలు, ఆశ వర్కర్లు, స్వయంసహాయక సంఘాలు, వీవోలతో బడి బాటపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ గ్రామాల్లోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు కే అక్షర, కే కృప, శివంజలికి ఈఎల్ఈఏపీ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కోశాధికారి మహాలక్ష్మి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో కుమారస్వామి, ప్రవీణ్ కుమార్, గట్టు శ్రీనివాస్, పిట్టల నరేందర్, ఉపాధ్యాయులు గజ్జెల రాజు, శ్రీకాంత్, రవి కుమార్, శ్రీధర్, కరుణాకర్, చంద్రశేఖర్, మంజుల, శ్రీదేవి, సరస్వతి , ప్రణీత, నీలిమ, ఎమ్మార్సీ సిబ్బంది గిరి, లవన్, జ్యోతి, వెంకన్న, రమేశ్ పాల్గొన్నారు. నర్మెట మండలంలోని వెల్దండ గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంఈవో మడిపల్లి ఐలయ్య పాల్గొని ఇంటింటికి తిరుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల గురించి వివరించారు. తహసీల్దార్ రామానుజాచారి, ఉపాధ్యాయులు అంజిరెడ్డి, శ్యాముల్ ఆనంద్, తిరుమల్‌రెడ్డి, రమేశ్, విజయ, బాలసిద్ధులు, కృష్ణమూర్తి, మాధవి పాల్గొన్నారు. జఫర్‌గఢ్ మండలంలోని తిడుగు పాఠశాల హెచ్‌ఎం సదానందం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో బడిబాట సమావేశం నిర్వహించారు. ఆశలు, కారోబార్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు నవీన్ రెడ్డి, మనోహర్ స్వామి, శ్రవణ్ కుమార్, డాక్టర్ కుందూరు సుధాకర్ పాల్గొన్నారు. బచ్చన్నపేట మండలంలోని అన్ని గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని సూచించారు. ఎంఈవో వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎంలు స్వర్ణతార, కృష్ణమూర్తి, వెంకటేశ్, కనుకయ్య పాల్గొన్నారు.



దేవరుప్పుల : సింగరాజుపల్లి గ్రామంలో బడి బాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి



లింగాలఘన్‌పూర్ : నెల్లుట్లలోని బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో బోజన్న



స్టేషన్‌ఘన్‌పూర్ : పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న మహాలక్ష్మి



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

## నష్కల్‌లో బొడ్రాయి ఉత్సవం

చిల్పూరు, జూన్ 6 : మండలంలోని నష్కల్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ బాగుండాలని, సకాలంలో వర్షాలు పడి, పంటలు బాగా పండాలని పూజలు చేసినట్లు తెలిపారు. నష్కల్ మాజీ ఉపసర్పంచ్ చిర్ర రాజుగౌడ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆరూరి స్వామి, చంద్రమొగిలి గౌడ్, వేణు గౌడ్ పాల్గొన్నారు.

## 9 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

హనుమకొండ చౌరస్తా, జూన్ 6 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఈఈ సెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల అడ్మిషన్ కోసం ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై తెలిపారు. విద్యార్థులు ర్యాంకు కార్డు, హాల్ టికెట్, ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ, టీసీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్‌సీ జిరాక్స్ ప్రతులు తీసుకురావాలని సూచించారు. 14 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని, వివరాలకు టీజీ డీఈఈసెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

నర్మెట, జూన్ 6 : మండల కేంద్రానికి చెందిన ఎర్రబోయిన యాదమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న నర్మెట తాజా మాజీ సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, ఆమెడపు గీతారెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. వారి వెంట మాజీ వార్డు సభ్యులు పొన్నం బాలకృష్ణ, యాదవ సంఘం సభ్యులు ముద్దం గట్టయ్య, ఎర్రబోయిన రాజు, వెంకటాద్రి, కర్ణాకర్, ఐలయ్య, మహేందర్, బాలయ్య ఉన్నారు.



ఎన్నారై శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

## పాఠశాల, గ్రామాభివృద్ధికి కృషి

బచ్చన్నపేట, జూన్ 6 : గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆలీంపూర్ వాసి, ఎన్నారై వంగాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో బడిబాట సందర్భంగా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. స్కూల్‌లో విద్యార్థులకు తాగునీరు అందించేందుకు వాటర్ ఫిల్టర్, అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మసూద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. అనంతరం ఎన్నారై శ్రీకాంత్‌రెడ్డిని పంచాయతీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రేవతిగౌడ్, కారోబార్ మురళి, హెచ్‌ఎం స్వర్ణతార, ఉపాధ్యాయులు నర్సమ్మ, బాలకిషన్, ఉమ, అంగన్‌వాడీలు వినోద, విజయ, రమాదేవి, ఆశ వర్కర్లు ప్రమీల, స్వప్న, నాయకులు జ్యోతి భైరయ్య, జ్యోతి భాస్కర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



ఇంకుడు గుంతకు ముగ్గు పోయిస్తున్న జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి

## హాస్టళ్లలో ఇంకుడు గుంతలు

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 6 : భూగర్భ జలాల పెంపు కోసం ప్రభుత్వ వసతి గృహాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి రవీందర్ రావు తెలిపారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో వార్డెన్ అనితతో కలిసి ఇంకుడు గుంతల ఏర్పాటుకు ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు వర్షపు నీరు వృథా పోకుండా హాస్టళ్లలో నాలుగు చొప్పున ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## మున్సిపల్ సిబ్బందికి వైద్య శిబిరం

జనగామ, జూన్ 6(నమస్తే తెలంగాణ) : వైద్య, ఆరోగ్య శాఖ, మున్సిపల్, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో జనగామ పురపాలక సంఘం సిబ్బందికి శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. శిబిరంలో పారిశుధ్య కార్మికులు, స్వయం సహాయక గ్రూపు సభ్యులు, మున్సిపల్ సిబ్బందికి తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సిబ్బంది తరచూ దుమ్ము, దూళి వంటి కాలుష్యం బారిన పడుతుంటారని, వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు.



బచ్చన్నపేటలో విచారణ చేస్తున్న తొర్రూరు పోలీసులు

## జీలుగ విత్తనాల అక్రమాలపై కొనసాగుతున్న విచారణ

బచ్చన్నపేట, జూన్ 6 : మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు శ్రీనివాస్‌రెడ్డి జీలుగ విత్తనాలను అక్రమంగా విక్రయించిన కేసులో నాలుగు రోజులుగా విచారణ కొనసాగుతూనే ఉంది. ఇందులో భాగంగా శుక్రవారం కూడా మండల కేంద్రంలోని రైతువేదికలో తొర్రూరు ట్రైనీ ఎస్సై రవికిరణ్ స్థానిక అధికారులతో కలిసి విచారణ చేపట్టారు. జీలుగ విత్తనాలు ఎవరెవరికి ఇచ్చారు? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. 27 బస్తాలు కాకుండా మరో 16 బస్తాలు తేడా వస్తున్నందున రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఏఈవోలు భాగ్యలక్ష్మి, రాజు ఉన్నారు.